క్లుప్తంగా

రెండో లైన్ పనుల పరిశీలన



రెండో లైన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ ఎ.ఎం.చౌదరి

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధి బొడ్డవర-శృంగవరపు కోట మధ్య కొత్తగా నిర్మించిన రెండో లైన్ పనులను సౌత్ ఈస్ట్రన్ సర్కిల్, రైల్వే సేఫ్టీ కమిషనర్ ఎ.ఎం. చౌదరి, వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్ కుమార్ సత్పతితో కలిసి సోమవారం పరిశీలించారు. కొత్తవలస-కోరాపుట్-కిరండూల్ లైన్ మార్గంలో రెండో లైన్ ప్రాజెక్టులో భాగంగా బొడ్డవర-శృంగవరపు కోట మధ్య 7.2 కిలోమీటర్లు పూర్తయిన మార్గంలో ఈ తనిఖీలు చేపట్టారు. ఎఎం చౌదరితో పాటు చీఫ్ ఇంజినీర్ కె.ధనుంజయరావు, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి. శ్రీనివాసరావు, చీఫ్ బ్రిడ్జి ఇంజినీర్ రాజ్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులు ఈ తనిఖీలలో, ట్రయల్ రన్‌లో పాల్గొన్నారు. ప్రతికూల వాతావరణంలో మారుమూల ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టును పూర్తి చేయడం చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. ఈ ప్రాజక్టులో భాగంగా పలు స్టేషన్ యార్డ్‌లలో నిర్మించిన కొత్త క్రాస్ ఓవర్లు, హై లెవెల్ ప్లాట్ ఫారాలు, వంతెనలు నిర్మించామని, వీటిన్నింటినీ సోమవారం ఉన్నతాధికారులు తనిఖీలు చేశారని ఏకే త్రిపాఠి తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం




సీతంపేటలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట దుర్గాగణపతి ఆలయం ఎదురుగా రూ.3.60 లక్షలతో సీసీ రోడ్, డ్రెయిన్లు నిర్మించనున్నారు. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ముద్దాడ ఎల్లాజీ, ఎస్.చిన్న, కె.కనకరాజు, బంగార్రాజు, కాంట్రాక్టర్ పూర్ణ చంద్రరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, గోవిందమ్మ, సచివాలయ కార్యదర్శులు, కార్యకర్తలు, మహిళలు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

కంచరపాలెం: వివిధ సమస్యలపై ప్రజలు అందిస్తున్న అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ ఆదేశించారు. జ్ఞానాపురం జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 08 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి జెడ్సీ వాటిని స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్‌ప్లానింగ్‌కు 02, పబ్లిక్ హెల్‌కు 02, యూసీడీకి 01, రెవెన్యూకు 02, ఇంజినీరింగ్ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు తెలిపారు.

చంద్రబాబు బీసీలకు చేసింది సున్నా



తుల్లి చంద్రశేఖర్

మద్రిపాలెం: రాష్ట్రంలో 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన నారా చంద్రబాబునాయుడు బీసీలకు చేసిందేమీ లేదని వైఎస్సార్‌సీపీ విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ తుల్లి చంద్రశేఖర్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే ఆయన పరిగణించారని ఎద్దేవా చేశారు. మహానాడులో బీసీలకు అండగా ఉంటానని చంద్రబాబు చెప్పిన కల్లబొల్లి కబుర్లను ప్రజలు నమ్మేపరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చిన ఘనత దేశంలో ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని కొనియాడారు. ముఖ్యమంత్రిగా ఆయనే తమ నమ్మకం, తమ భవిష్యత్ అని రాష్ట్రంలోని బీసీలు భావిస్తున్నారన్నారు.

ఆటవిడుపు

- జీవీఎంసీ హైస్కూళ్లలో ఉత్సాహంగా సమ్మర్ క్యాంప్స్
- వివిధ క్రీడల్లో విద్యార్థులకు శిక్షణ



మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో యోగా నేర్చుకుంటున్న విద్యార్థులు



ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్‌లో విద్యార్థులకు క్రికెట్ నేర్పుతున్న పీడీ సునంద్



ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్‌లో కరాటేలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్న ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్ విద్యార్థులు

సీతంపేట: ఏడాదంతా చదువులో నిమగ్నమైన విద్యార్థులకు ఆటవిడుపు దొరికింది. వేసవి సెలవులు ఇచ్చారంటే పిల్లలు చదువుకు టాటా చెప్పి టీవీ, మొబైల్ ఫోన్ గేమ్స్, షార్ట్స్, రీల్స్‌లో మునిగి తేలుతున్నారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్నిచ్చే ఆటలకు దూరంగా ఉంటున్నారు. వేసవి సెలవుల్లో ప్రతి ఏటా జీవీఎంసీ పాఠశాలల్లో విద్యార్థులకు సమ్మర్ క్యాంప్స్ నిర్వహించి వారికి ఇష్టమైన ఆటల్లో శిక్షణ ఇస్తుండేవారు. కరోనా కారణంగా మూడేళ్లుగా క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించలేదు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి చొరవతో ఈ ఏడాది 15 రోజుల పాటు సమ్మర్ క్యాంప్స్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 22న ప్రారంభమైన వేసవి శిబిరాలు వచ్చే నెల 5 వరకు కొనసాగనున్నాయి. జీవీఎంసీ స్కూళ్లతోపాటు వివిధ స్పోర్ట్స్ అసోసియేషన్లు క్యాంప్స్ నిర్వహిస్తున్నాయి.

33 రకాల క్రీడాంశాలు.. 3,290 మంది విద్యార్థులు

ఉత్తర నియోజకవర్గంలోని జోన్-3 పరిధిలో 37 చోట్ల, జోన్-5 పరిధిలో 80 చోట్ల సమ్మర్ క్యాంప్స్ జరుగుతున్నాయి. ఆయా కేంద్రాల్లో 33 రకాల క్రీడాంశాల్లో సుమారు 3,290 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. జీవీఎంసీ పాఠశాలల్లో ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు శిబిరాలు నిర్వహిస్తున్నారు. శిక్షణలో పాల్గొన్న వారికి పాలు, గుడ్డు, బిస్కట్లు వంటి స్నాక్స్ జీవీఎంసీ అందిస్తోంది. క్రికెట్, కరాటే, బాక్సింగ్, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నిస్, ట్రైథ్లాన్, త్రో బాల్, యోగా, చెస్, క్యారమ్స్, టైక్వాండో, హ్యాండ్‌బాల్, బాస్కెట్ బాల్, ఫుట్‌బాల్, స్విమ్మింగ్, అథ్లెటిక్స్ వంటి అంశాల్లో ఫిజికల్ డైరెక్టర్లు(పీడీ) ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. శారీరక ఆరోగ్యం, సామర్థ్యం, వేగం, చురుకుదనం, సహనం, ఫ్లెక్సిబిలిటీ పెంపొందించేలా విద్యార్థులతో పలు రకాల ఎక్సర్‌సైజులు, వర్క్ అవుట్స్ చేయిస్తున్నారు. వాకింగ్, జాగింగ్, రన్నింగ్, హైనీస్, షటిల్‌రన్, క్రంచెస్, స్క్వాట్స్, యోగా చేయిస్తున్నారు. అనంతరం వారికి నచ్చిన ఆటలో 15 రోజుల పాటు శిక్షణ అందిస్తున్నారు.

పీడీలే శిక్షకులు.. మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో పీడీ టీచర్ తబిత వాలీబాల్, త్రోబాల్, యోగా, బ్యాడ్మింటన్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో పీడీ మాస్టర్ సునంద్ పిల్లలకు ఫిట్‌నెట్‌పై ట్రైనింగ్ ఇస్తున్నారు. అనంతరం క్రికెట్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఇదే పాఠశాలలో కోచ్ వెంకటరావు బాక్సింగ్‌లో, కోచ్ యోగి కరాటేలో శిక్షణ ఇస్తున్నారు. ప్రతి రోజూ 60 నుంచి 80 మంది వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని వారు తెలిపారు.

మూడు క్రీడల్లో శిక్షణ



మా పాఠశాలలో నేను క్రికెట్‌లో శిక్షణ ఇస్తున్నాను. బాక్సింగ్, కరాటే అసోసియేషన్లు శిక్షణ ఇస్తున్నాయి. సుమారు 80 మంది విద్యార్థులు ఈ మూడు అంశాల్లో శిక్షణ పొందుతున్నారు. ముందుగా వార్మప్ ఎక్సర్‌సైజులు, ఫిట్‌నెస్ ఎక్సర్‌సైజ్‌లు చేయించి, ఆతర్వాత ఆటల్లో మెళకువలపై శిక్షణ ఇస్తున్నాం. క్యాంప్‌లో పాల్గొనే పిల్లలకు స్నాక్స్ అందజేస్తున్నాం.

– సునంద్, పీడీ, జీవీఎంసీ హైస్కూల్, ఎన్జీజీవోస్ కాలనీ

క్రికెట్‌లో శిక్షణ పొందుతున్నా..



నాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. సమ్మర్ క్యాంప్‌లో సునంద్ సార్ వద్ద శిక్షణ పొందుతున్నాను. బ్యాటింగ్, ఫీల్డింగ్, బౌలింగ్‌లో టెక్నిక్స్, ఫిట్‌నెస్ ఎలా మెరుగుపర్చుకోవాలి నేర్పుతున్నారు. ఈ ఏడాది క్రీడల్లో శిక్షణ ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది.

– కోట్ల నవదీప్, 9వ తరగతి, ఎన్జీజీవోస్ కాలనీ

వాలీబాల్ నేర్చుకుంటున్నా..



నాకు వాలీబాల్ అంటే ఇష్టం. స్కూల్‌లో జరుగుతున్న సమ్మర్ క్యాంప్‌లో తబితా మేడం వద్ద శిక్షణ తీసుకుంటున్నాను. క్యాంప్ ముగిశాక కూడా వాలీబాల్ ఆడటం కొనసాగిస్తా. నచ్చిన గేమ్ నేర్చుకోవడం ఎంతో సంతోషంగా ఉంది.

– పాండురంగ, 8వ తరగతి, మధురానగర్ హైస్కూల్

ఆత్మవిశ్వాసంతో సిద్ధం కండి



మాట్లాడుతున్న జేఈఈ నిపుణుడు మస్తాన్‌రావు

సీతంపేట: ఒత్తిడికి లోను కాకుండా ఆత్మవిశ్వాసంతోనే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో విజయం సాధించగలరని జేఈఈ శిక్షణ నిపుణుడు, ఫిట్జీ మేనేజింగ్ పార్ట్‌నర్ పెండేల మస్తాన్‌రావు అన్నారు. వచ్చే నెల 4న దేశవ్యాప్తంగా జరగనున్న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష జరగనున్న నేపథ్యంలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శంకరమఠం రోడ్‌లోని ఒక హోటల్‌లో సోమవారం జరిగిన సదస్సులో ఆయన అవగాహన కల్పించారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ మూడు సబ్జెక్టుల్లో సమతుల్యత పాటించాలని, నిర్దిష్టమైన నిద్ర, ఆహార వేళలు అవసరమని సూచించారు. ఏకాగ్రతతో చదవడం, పూర్తిగా పట్టులేని అంశాలపై ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. కొత్త విషయాల జోలికి చివరి నిమిషంలో పోవద్దన్నారు. మొదటి పరీక్ష రాసిన తర్వాత ఎవరితోనూ ఏ విధమైన చర్చ చేయవద్దని, రెండు పేపర్లను విడివిడిగా చూడాలని సూచించారు. పరీక్ష కేంద్రాన్ని ముందు రోజు సందర్శించాలని, అడ్మిట్ కార్డు, విద్యార్థి గుర్తింపు కార్డు పరీక్ష రోజు మర్చిపోకుండా తీసుకెళ్లాలన్నారు. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుని పరీక్షకు సన్నద్ధం కావాలని మస్తాన్‌రావు సూచించారు.

రైల్వే స్కూల్‌ను తొలగించొద్దు

మహారాణిపేట: రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల(రైల్వే స్కూల్) తొలగింపు నిర్ణయానికి వ్యతిరేకంగా పూర్వ విద్యార్థుల సంఘం, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. 430 మంది విద్యార్థులతో ఈ పాఠశాల అభివృద్ధి పథంలో నడుస్తోందని, నాడు-నేడు కింద ప్రభుత్వం అనేక పనులు చేపట్టిందని వారు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయాన్ని పునః పరిశీలించాలని పూర్వ విద్యార్థి కొత్తపల్లి వెంకటరమణ కోరారు.

చంద్రబాబు చౌకబారు వ్యాఖ్యలపై నిరసన

వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ



కె.కె.రాజు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేస్తున్న కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు

సీతమ్మధార: ప్రభుత్వం పేదలకు అందించే ఇళ్ల స్థలాలను శ్మశానవాటికలతో పోల్చుతూ టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన అహంకారపూరిత వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, నాయకులు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయం నుంచి జాతీయ రహదారి ఆర్ అండ్ బీ జంక్షన్ వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు లేని ప్రతీ పేదవాడికి సొంతిల్లు కల్పించాలని సదుద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా పెద్ద ఎత్తున ఇళ్ల పట్టాల ఇవ్వడంతోపాటు గృహ నిర్మాణాలకు శ్రీకారం చుట్టారన్నారు. అమరావతిలో 50 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారని చెప్పారు. ఇటువంటి మంచి కార్యక్రమాలు సీఎం చేపడుతుంటే.. ప్రతిపక్ష నేత చంద్రబాబు పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలను కించపరిచేలా అహంకారపూరిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు.

అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటై నాలుగేళ్లు కావడంతో పార్టీ శ్రేణుల మధ్య కె.కె.రాజు కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు కంపా హనోకు, అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపల్లి గోవింద్, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, కంటిపాము కామేశ్వరి, రెయ్యి వెంకటరమణ, వి.ప్రసాద్, కో-ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, మాజీ కార్పొరేటర్లు కె.వెంగళరావు, బులుసు జగదీష్, పార్టీ వార్డు అధ్యక్షులు నీలి రవి, పైడి రమణ, గుజ్జు వెంకటరెడ్డి, దుప్పలపూడి శ్రీనివాసరావు, పేడాడ రమణికుమారి, జిల్లా వక్ఫ్ బోర్డు ప్రెసిడెంట్ కె.వి.బాబా, ఎయిర్‌పోర్ట్ అథారిటీ మెంబర్ శైలేష్, రాష్ట్ర డైరెక్టర్లు, సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'గైస్' అభివృద్ధికి సహకారం



మేయర్ హరివెంకటకుమారికి వినతిపత్రం అందిస్తున్న గైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి హామీ ఇచ్చినట్లు గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. ఈమేరకు సోమవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన కాలేజీ అభివృద్ధికి సంబంధించి పలు విషయాలను మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. కాలేజీ ఎదురుగా ఉన్న డ్రైనేజీ సమస్య వల్ల వర్షపు నీరు లోపలికి ప్రవేశించడంతో ఇబ్బంది పడుతున్నామని, దీని నియంత్రణకు జాతీయ రహదారిని ఆనుకుని కాలువ నిర్మించాలని, హైవేకు అనుబంధంగా కాలేజీ అనుబంధ రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందించారు. దీనిపై సీతఈతో మాట్లాడి తక్షణం చర్యలు తీసుకుంటామని మేయర్ హామీ ఇచ్చారు. కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ బి.వి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

వలంటీర్ల పాత్ర కీలకం



సేవా పురస్కారంతో వలంటీర్‌ను సత్కరిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్లు కామేశ్వరి, శశికళ

కంచరపాలెం: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి వలంటీర్ వ్యవస్థని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, కె.కె.రాజు అన్నారు. మాధవధార మాధవ స్వామి కమ్యూనిటీ హాల్‌లో జోన్-5 యూసీడీ ఆధ్వర్యంలో సోమవారం 47, 55 వార్డులకు చెందిన వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలు ముంగిటకు చేర్చడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. ఆయా వార్డుల కార్పొరేటర్లు కంటిపాము కామేశ్వరి, కె.వి.ఎన్.శశికళ మాట్లాడుతూ గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజా సమస్యలను అటు అధికారులకు.. ఇటు ప్రజాప్రతినిధులకు చేరవేయడంలో వలంటీర్ల సేవలు అభినందనీయమన్నారు. అనంతరం వలంటీర్లను సేవా పురస్కారాలతో సత్కరించి మెమెంటాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జోన్-5 ఏపీడీ కె.శైలజ, సీడీవో పద్మావతి, పార్టీ నాయకులు ఎస్.అప్పారావు, సుకుమార్, వైఎస్ రావు, గురువోజీ, ఆళ్ల గోపి, రాఘవులు, కృపా, సురేష్, రమేష్, గోపి, లక్ష్మణ్, కనకరాజు, నర్సింగ్, గౌస్, సంతోష్, సచివాలయ కన్వీనర్లు, సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే జగనన్న ధ్యేయం

'గడప గడపకు మన ప్రభుత్వం'లో కె.కె.రాజు



48వ వార్డులో మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న కె.కె.రాజు

కంచరపాలెం: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 48వ వార్డు ఏఎస్సార్ నగర్ సచివాలయం 273, ఇందిరానగర్-5 ప్రాంతాల్లో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కొండవాలు ప్రాంతాల్లో మౌలిక వసతులు అధ్వానంగా ఉన్నాయని, వాటిని మెరుగు పరచాలని కోరుతూ నివాసులు వినతిపత్రాలు అందించారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో కె.కె.రాజు మాట్లాడారు. టీడీపీ హయాంలో పాలకులు స్వార్థపూరిత రాజకీయాల కోసం ప్రజలను మోసగించే వారని గుర్తుచేశారు. సంపూర్ణ మనసుతో ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న గొప్ప నాయకుడు జగనన్న అని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డ్ ఇన్‌చార్జి నీలి రవి, సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి, వార్డు నాయకులు శ్రీరామ్, కర్రి అప్పారావు, సురేష్, రాము, ఎర్ర శ్రీను, కండిపిల్లి శ్రీను, రమణ, ఉష, అనసూయ, పూర్ణిమ, విజయ, దేవుడమ్మ, లక్ష్మి, ఈశ్వరి, హంసవేణి, యువజన విభాగం ఇన్‌చార్జి ఎం.సునీల్, సీనియర్ నాయకులు బాబ్జి, వి.అప్పారావు, గురువోజీ, చందురెడ్డి, చిన్నారావు, జీవీఎంసీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



గాంధీనగర్‌లో శంకుస్థాపన చేస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో పలు అభివృద్ధి పనులకు సోమవారం కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు శంకుస్థాపన చేశారు. రూ.43,25,000 వ్యయంతో గాంధీనగర్-1, 2, మహత్ కాలనీలో బీటీ రోడ్డు, కళింగనగర్‌లో డ్రైనేజీ కల్వర్టులు, కాలువల నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల యోగక్షేమాలు, సంక్షేమ పథకాల అమలు గురించి తెలుసుకోవడంతోపాటు ముఖ్యంగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకుంటున్నామని చెప్పారు. మౌలిక వసతులకు సంబంధించి సమస్యలు, చేయాల్సిన పనులను ఆగస్టు లోపు పూర్తి చేస్తామన్నారు. కార్పొరేటర్ రెయ్యి మాట్లాడుతూ వార్డు అభివృద్ధి పనులకు రూ.11 కోట్ల నిధులు మంజూరయ్యాయని, రూ.4 కోట్ల పనులు టెండరింగ్ ప్రక్రియలో ఉన్నాయని తెలిపారు. అనంతరం గాంధీనగర్‌లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి కె.కె.రాజు పూల మాలలు వేశారు. కార్యక్రమంలో 47వ వార్డు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి, ఏఈ అర్చన, డైరెక్టర్లు పైడి శ్రీను, దిడ్డి రమేష్, 51వ వార్డు నాయకులు పైడి ప్రతాప్, తిరుమలరావు, పప్పల లక్ష్మణ్, అప్పారావు మాస్టర్, శ్యామ్, రత్న, రాణి, వై.వరలక్ష్మి, లత, ధర్మవతి, వినోద్, గణేష్, సాధు, బాబూరావు, ఆది ఆంధ్ర సేవా సంఘం కమిటీ సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచాన్ని కలవరపెడుతున్న ధూమపానం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్ తదితరులు

సీతంపేట: ఈ నెల 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల వికాస ఫౌండేషన్, గాంధీ సెంటర్ రూపొందించిన వరల్డ్ నో టుబాకో వాల్‌పోస్టర్‌ను సోమవారం బుల్లయ్య కళాశాల ఆవరణలోని గాంధీ సెంటర్‌లో ఆచార్య బాలమోహన్‌దాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధూమపానంతో ఏటా సుమారు 10 లక్షల మంది చనిపోతున్నారని, ప్రస్తుతం ప్రపంచాన్ని అది కలవరపెడుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అలవాటు సరదాగా ప్రారంభమై ప్రాణం పోయే వరకు ఉంటుందన్నారు. ఫౌండేషన్ ప్రతినిధి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ పొగ లేని పొగాకు అంటే పాన్, గుట్కా వినియోగదారులు కూడా క్యాన్సర్ బారినపడుతున్నారన్నారు. ధూమపానం వల్ల కలిగే అనర్థాలపై ప్రభుత్వాలు ప్రచారం చేస్తున్నప్పటికీ ఆశించిన ఫలితాలు రావడం లేదని పేర్కొన్నారు. ప్రచారాన్ని మరింత ముమ్మరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యమూర్తి, ఆచార్య రామకృష్ణారావు, ఆచార్య హరినారాయణ, డాక్టర్ గౌరీశంకర్ పాల్గొన్నారు.

సీఎంఏ కోర్సుతో ఉజ్వల భవిష్యత్




మాట్లాడుతున్న సంస్థ చైర్మన్ కృష్ణమాచారి

సీతంపేట: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం చాప్టర్‌కు కొత్త కార్యవర్గం ఎన్నికైంది. 2023 నుంచి 27 వరకు తొమ్మిది మందితో ఎగ్జిక్యూటివ్ బాడీ ఏర్పాటైంది. పి.బి.కృష్ణమాచారి చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా యు.లక్ష్మణరావు, కార్యదర్శిగా జి.రామచంద్రారెడ్డి, హిమబిందు కోశాధికారిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అక్కయ్యపాలెంలోని సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో చైర్మన్ కృష్ణమాచారి మాట్లాడుతూ కాస్ట్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్(సీఎంఏ) కోర్సుతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. ప్రస్తుతం సంస్థలో 800 మంది సీఎంఏ విద్యార్థులు ఉన్నారని, ప్రతి ఏటా 300 నుంచి 600 మంది ఈ కోర్సులో చేరుతున్నారని చెప్పారు. వారికి అవసరమైన అన్ని సదుపాయాలు, అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో తరగతులు, ఉత్తీర్ణత శాతం పెరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. సీఎంఏ కోర్సు పూర్తి చేసిన వారికి పబ్లిక్ సెక్టార్‌లో ఎక్కువ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ కోర్సుపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ లక్ష్మణరావు, కార్యదర్శి జి.రామలింగారెడ్డి, కోశాధికారి హిమబిందు, సభ్యులు శిరీష, నరేంద్ర, వెంకటేష్, సంపత్‌కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

షేడింగ్ ఆర్ట్‌పై విద్యార్థులకు శిక్షణ

మురళీనగర్: మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు షేడింగ్ ఆర్ట్‌పై మెళకువలు నేర్పించారు. రిసోర్స్ పర్సన్ ఆర్.స్నేహిలత వెట్ అండ్ వెట్, షేడింగ్ ఆర్ట్ వేసే విధానాన్ని వివరించి పిల్లలతో సాధన చేయించారు. లైబ్రేరియన్ వై.పద్మజ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్ట్ టీచర్ జి.శిరీషలత తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఆనంద్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీటీ, ఆర్ఐ, వీఆర్వోలు

సీతమ్మధార: సీతమ్మధార మండల అర్బన్ తహసీల్దార్‌గా ఆనంద్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన కలెక్టరేట్‌లో ఏవోగా పనిచేశారు. తరువాత పెందుర్తి తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. బదిలీల్లో భాగంగా సీతమ్మధార మండలానికి తహసీల్దార్‌గా వచ్చారు. ఆయనకు డిప్యూటీ తహసీల్దార్ చేతన్‌కుమార్, ఆర్ఐ రవికృష్ణ, వీఆర్వోలు, సచివాలయం కార్యదర్శులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

'స్పందన'కు 16 అర్జీలు

అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 16 వినతులు అందాయి. కొత్త తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆనంద్‌కుమార్ అర్జీదారుల నుంచి వాటిని స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చేతన్, ఆర్ఐ రవి కృష్ణ, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

'సొల్యూషన్ టు ప్లాస్టిక్ పొల్యూషన్'పై పోటీలు



డ్రాయింగ్ పోటీలో పాల్గొన్న చిన్నారులు

సీతంపేట: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, గ్రీన్ క్లెమైట్ సంస్థలు సంయుక్తంగా సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పోటీలు నిర్వహించాయి. 'సొల్యూషన్ టు ప్లాస్టిక్ పొల్యూషన్' అనే అంశంపై జరిగిన డ్రాయింగ్, ఎలక్యూషన్, క్విజ్ పోటీల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. ఏయూ పర్యావరణ విభాగం ఆచార్యుడు ఇ.యు.బి.రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యం ప్రపంచానికి ఎంతో చేటుగా మారిందని వివరించారు. ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రీన్ కార్ప్స్ విశాఖ జిల్లా కో ఆర్డినేటర్ బాబూరావు, సెయింట్ జోసెఫ్ కళాశాల లెక్చరర్ మేరీ అనుపమ, కాలుష్య నియంత్రణ మండలి ఏఈ శ్రీలక్ష్మి, గ్రీన్ క్లెమైట్ కార్యదర్శి జె.వి.రత్నం, గ్రీన్ వలంటీర్లు వి.కిరణ్మయి, ఎంజలీన్ భాస్కర్, జీవీఎంసీ ప్రతినిధి మంగరాజు పాల్గొన్నారు.